హర్‌లాల్ మొన్న వ్రాసిన లేఖలో "ఏదో మీకెంతో లాభమున్నది!" అన్నట్లుగా వ్రాశారు. ఏమి లాభం? అది ఏరూపంలో వుంటుంది? ఆర్థికంగా సహాయంచేసి మరో యూనివర్సిటీ నిర్మాణం సాగిస్తారా, లేకపోతే ప్రాంతీయ భాషల సరసన హిందీని నడపడాని కంగీకరిస్తారా? రెండూ చెయ్యరు. హిందీ భాషా వాదులు అంత సరసంగా యింతవరకెక్కడా ప్రవర్తించలేదు. ఒకవంక హిందీని బలవంతంగా ఎవరిమీదా రుద్దవద్దని చెప్పే నెహ్రూ హైద్రాబాద్ ప్రజలమీద బలవంతంగా తెనెందుకు రుద్ద ప్రయత్నిస్తున్నాడో అర్థమవడం లేదు. బహుశా యిదంతా చుట్టూచేరిన గ్రహబలం కావచ్చు.

ఈమధ్య యీ స్వాధీనానికి సంస్థానం మొత్తంలోనూ ఒకే ఒకమనిషి సమర్థించడానికి దొరికారు. ఆయనే శ్రీరామానందతీర్థ. వీళ్లెప్పటికప్పుడే మర్చిపోతుంటారు. మొన్ననే గదా ప్రజలు కాంగ్రెసువాళ్ళకు గుణపాఠం చెప్పింది! దాన్నుంచి చక్కగా ప్రజాభిప్రాయాన్ని ప్రతికూలించకూడదు అని బుద్ధి తెచ్చుకోక జవహర్‌లాల్ ముఖప్రీతికోసమో, లేకపోతే కేంద్ర విద్యాశాఖ చెప్పేడుమాటలు విని యీ ప్రకటనను ప్రస్తుత కాంగ్రెస్ అధ్యక్షుడు చేసిఉంటాడు. ఈయన త్వరలో తన పొరపాటును తెలుసుకుంటే మంచిది.

నిజంగా జవహర్‌లాల్ చెప్పిన ఆ లాభాలేమిటో అవి ఏరూపంలో వుంటవో తెలియపరచి, తర్వాత నిష్పాక్షికంగా ప్రజాభిప్రాయాన్ని సేకరించడానికి ఒకకమిటీని నియమిస్తే ప్రజలు సంతోషిస్తారు.

కథానిక

# ఓడిపోయిన సత్యం

అవసరాల రామకృష్ణారావు

ఏమిటో-చిట్టిని చూస్తే అప్పుడప్పుడు నవ్వొస్తుంది, మరొకప్పుడు జాలేస్తుంది. అయినా యీ లోకానికి జాలిపడ్డంకన్న నవ్వుకోడమే ఎక్కువ చాతనవును పుట్టుకతో అందరు ఆడపిల్లలూ యింతో అంతో బుద్ధి తెచ్చుకుంటారు. వాళ్ళమ్మ దానికి చక్కగా రూపంయిచ్చి వికసింప చేస్తుంది. కాని పాపం చిట్టికి యీ రెండు విషయాల్లోనూ అన్యాయమే జరిగింది. పన్నెండేళ్ల చిట్టికి పదహారేళ్ళ శరీరమే వచ్చిందికాని పదేళ్ళ బుద్ధియినా రాలేదు. చిట్టికి లోకంతో పరిచయం ఏర్పడేవేళకి వాళ్ళమ్మకి ఈలోకంతో శాశ్వతంగా పరిచయం తీరిపోయింది. ఆడపిల్లలకి ఆత్తారిల్లే అంతా కాబట్టి చిట్టికి యిద్దరు అక్కలున్నా వాళ్ళకి దీనిగొడవ పట్టించుకునే అవసరమే లేకపోయింది. వీళ్ళుగాక అన్న, తండ్రి యిద్దరున్నా వాళ్ళకి పేకాటలో ఉన్న నేర్పులో యీ పిల్లని, పెంచడంలో ఓర్పు మాయమయింది. అందువల్లనే పాపం చిట్టి బాధ్యతలేని బంధువుల చేతుల్లో పెరిగి పెద్దదైంది. అంధకారం అలుముకున్నా యీ ఆడపిల్ల అమాయిక చరిత్ర ఎవరికీ కనపడదు, అసంపూర్తిగా అంతరించిన ఆ మాతృబాధ ఎవరికీ వినబడదు. అందరికీ కనిపించేది దాని చాయిలా స్వభావమూ, భారమయిన శరీరమూను.

తండ్రి దీని సంగతే పట్టించుకోడు. అందర్లోకీ చిన్నపిల్ల అవడంవల్ల అది అడిగిందల్లా యివ్వడమే అతను చూపించే ముద్దూ ముచ్చటా. అంతేగాని దీనివల్ల మంచివస్తుందో చెడ్డవస్తుందో అతనికి అవసరం లేదు. సెకండుఫారం చదువువల్ల చిట్టికి బోధపడింది క్లాసు పుస్తకాలకన్న పత్రికలూ నవలలూ బాగుంటాయని. డబ్బుండడంచేత ఆదికనిపించినపుస్తకమల్లా కొనుక్కు చదివేది. వచ్చే సినిమాకల్లా వెళ్ళేది. వీటివల్ల చిట్టి నేర్చుకున్నది అద్దంముందు గంటలకొద్దీ నిలబడ్డం, ఊర్లోకివచ్చిన కొత్తఫేషను మొదట తానే అనుకరించడం. స్కూల్లో ఎవరేపేరు పెట్టి పిలిచినా దానికి సరదాగానే ఉండేది గాని ఉడుక్కునేది కాదు. దానికి ఈ పన్నెండేళ్ళ

జీవితంలోనూ యిలాగే ఏరంగు రంగులూ లేకుండా గడిచిపోయింది.

స్వతహాగా డబ్బున్న వాళ్ళవడంవల్ల కట్నాల కోసమై చిట్టికి అప్పుడే సంబంధాలు రావడం మొదలుపెట్టాయి. పుస్తకాల్లో ఆర్జించిన బుద్ధి వల్ల చిట్టికి యీ విషయం వినగానే సిగ్గువేసేది. నల్లటిరంగు కావడంవల్ల దాని బుగ్గలు మాత్రం ఎరుపెక్కేవి కావు. "అబ్బా, ఏమిటి నాన్నా!" అనేది అసలే వెడల్పయిన నోరుని మరింత వెడల్పు చేసి. తండ్రిని ఓ తోపుతోసేది. తండ్రి అభిమానంతో దాన్ని దగ్గరకు తీసుకుని నవ్వుకొనేవాడు. కాని అంతట్లో అతని నవ్వు విచారంగా మారిపోయేది. "కొడుకు ఎలాగా చేతికిరాకుండా అలా తయారయ్యాడు. వాడు ఏ రోజు ఎక్కడుంటాడో వాడికే తెలీదు. ఎటొచ్చీ మిగిలినది యిది. ఇదీ లేకపోతే నేనేమైపోతానూ?" అనిపించేది. కాని అంతరంగం తరంగం లాంటిది. "మాయదారి మనసు క్షణంలో మారిపోయేది. ముసిలాడ్ని నేను ఏమైపోతేనేం? అయినా ఇప్పట్లో నేను ఏమీ అయిపోను. ఇంకా నాలుగు రోజులు పాటు యింట్లో ఉంటే యిదే ఏమైనా అయిపోతుంది" అనుకునేవాడు. అతని దృష్టి అమాంతంగా సుబ్బమ్మగారిమీద పడింది. ఆవిడ అతనికి వరసకి చెల్లెలవుతుంది. ఆవిడ కొడుకు సత్యం బియ్యే ప్యాసయినవాడు ఉండనే ఉన్నాడు. ఇన్నాళ్ళూ యీ ఆలోచన తోచనందుకు చిట్టి తండ్రి తన్నుతనే తిట్టుకున్నాడు. నాలుగు రోజులు పేకాట మాని ఆ వూరు వెళ్ళేడు. "ఈ రోజుల్లో మన యిష్టమా నాయనా? వాణ్ణే కనుక్కో" అంది సుబ్బమ్మగారు.

* * *

"ఏంరా ఎలా ఉంది పిల్ల?"

"పరువుచుట్టలాంటి ఒళ్ళూ, పొగాకు చుట్టలాంటి రంగూ ... మరోసారి చూడ్డం కష్టమే."

సుబ్బమ్మగారు నవ్వుకుంది.

"ఏమే చిట్టీ, ఎలా ఉన్నాడు అబ్బాయి."

చిట్టి మాట్లాడలేదు. అటు తిరిగి పోయింది. అంత చిన్న కళ్ళల్లోనూ అవ్యక్తమైన మెరుపు ఆ తండ్రి కనిపెట్టేడు. పదిమందిచేతా సుబ్బమ్మగారికి చెప్పించాడు, బోలెడు కట్నం ఇస్తానని తనే స్వయంగా వెళ్ళి అడిగాడు. తెలిసిన వాళ్ళచేత అడిగించాడు. ఊఁహూఁ, సత్యం ఒప్పుకోలేదు. చిట్టికిమాత్రం సత్యం నచ్చాడు. ఎందుకు వాడంటే తనకింత యిష్టం ఏర్పడిందో దానికే తెలీదు. వాడినే పెళ్ళి చేసుకోవాలనుకుంది. మళ్ళీ వాడూ అంత బాగుండడు. వాడి మొహం తీర్చి దిద్దినట్టే ఉంటుంది కాని "ఒడ్డూ పొడుగూ కావాలిగాని మొగాడికి అంద మెందుకూ?" అంటే వాడు దమ్మిడీకి కొరగాడు. అయినా వాడు దానికి మనస్ఫూర్తిగా నచ్చాడు. వాడంటే దానికి యిష్టమేనని చెప్పగలదుగాని అది అభిమానమో అనురాగమో చెప్పడానికి దానికి వయసు చాలదు. వాడు వద్దనగానే అది "అయ్యో" అనుకుంది, అంతే. దాని యిష్టానికి పరిపూర్ణతా, దృఢత్వమూ లేకపోవడం మూలాన అది అట్టే బాధపడలేదు.

సత్యానికి ఆ మరుచటి నెలలోనే పెళ్ళి కుదిరింది. పెళ్ళికూతురు చిట్టికి ఓ వరసని అక్క అవుతుంది. "ఇంతోటి అందగాడికి మేం పనికొచ్చాం కాదు. అతని కళ్ళకి నువ్వు రంభలా కనపడుతున్నావు కాబోలు" అని చెల్లెలు తరఫున చిట్టి అక్కలు పెళ్ళికూతురితో అన్నారు. వాళ్ళు యీకోపంచేత పెళ్ళికి కూడా రాలేదు. చిట్టిమాత్రం ఎందరు వద్దన్నా పెళ్ళికి వచ్చింది.

ఆ పెళ్ళిలో చిట్టి చేష్టలు చూసి నవ్వుకోని వాళ్ళులేరు. దీనికి కారణం దానికి ఈ లోకపు హద్దులూ, కట్టుబాట్లూ తెలియక పోవడమే. దాని మనసుకి తోచినట్టు అది చెయ్యవచ్చునో కూడదో దానికి చెప్పేవాళ్ళులేరు. దాని ఒళ్లు చూసి అది పన్నెండేళ్ళదనీ, దాని మనసు వయసు ఎనిమిదేళ్ళనీ ఎవరూ అనుకోలేదు. అది నాగవిల్లి దగ్గరా, గుమ్మాలదగ్గిర పేర్లుచెప్పించే దగ్గిరా, బంతులాట దగ్గిరా, హోమాలదగ్గిరా అందరికన్నా ముందుగా పెళ్ళికొడుకు మొహంలోకి చూస్తూ కూర్చునేది. "ఇది తప్పమ్మా, యిలా చెయ్యకూడదు" అని ఒకరిద్దరు పెద్దలు చూసి మందలించినా ఎందుకు తప్పో దానికి

బోధపడక పోవడంవల్ల అది ఆ పనులు మానేది కాదు. దానికి ప్రపంచంలో రీతులుగాని, నీతులుగాని ఎవరూ నేర్పలేదు. అతని కళ్ళల్లోకి చూస్తే దానికెంతో ఆనందంగా ఉండేది అంతే దానికి తెలుసు. కొత్త పెళ్లికూతురువైపు కొంటె చూపులు చూసేసత్యం అసలే కథకుడు కావడం వల్ల, దీని చేష్టలు గమనించడం మొదలుపెట్టేడు. దీని చూపులు ఆ చుట్టుపట్ల ఉన్న తన స్నేహితులకి సౌజ్ఞలు చేసి చూపించాడు. ఇలాంటి గ్రాహ్యశక్తిలో ఆరితేరిన ఆ ఫ్రెండ్స్ నవ్వుకొనేవాళ్ళు. అప్పుడప్పుడు చిట్టి సత్యాన్ని నవ్వుతూ అమాయకంగా పలకరించేది. సత్యం దాన్ని ఏడిపించాలని మళ్ళీ నవ్వేవాడు. దాని మొహం చింకిచాటంతయేది. ఆ నవ్వు అస అయిందో, హాస్యమయిందో దానికేం తెలుసు? చాతకాని వాళ్ళనీ, అర్థం చేసుకోలేని అసహాయుల్నీ ఆధారం చేసుకుని అందరిలాగే సత్యం కూడా హాస్యం అనుభవించేవాడు.

తరువాత తను విచారంగా యింటికొస్తానేమోననీ, సత్యానికి దూరంగా అయిపోడం తనకి కష్టం వేస్తుందనీ ఆఖరికి వాడు తనకు కళ్ళకేనా కనిపించకుండా అయిపోతాడనీ చిట్టికి ఆ క్షణానికి తోచలేదు. అది సరదాపడి వీళ్ళతోనూ వాళ్ళతోనూ చెప్పి మనుగుడుపులికి కూడా వచ్చింది. మొగపెళ్ళివారింట్లో దాన్ని మరీ లోకువచేసి పాలుతాగే పిల్లాడి మొదలు పనిచేసే పిల్లవరకూ దాన్ని ఏడిపించేవారు. అయినా దానికి కావలసింది సత్యం కళ్ల పడ్డమే.

చిట్టికి కూడా ఎప్పుడో అప్పుడు పెళ్ళయిపోతుంది. అది ఎవరికీ కనపడకుండా అత్తారింటికి వెళ్ళిపోతుంది. ఈ సంగతి సత్యానికి తెలుసు. కాని హాస్యరూపంగా తన హృదయంలో ప్రవేశించిన యీ చిట్టి చెరగని మచ్చ అవుతుందని అతని కవితాహృదయం అనుకోలేదు. ఇలా జరగడానికి కారణం చిట్టి రేపు వెళ్ళిపోతుందనగా ఇవాళ జరిగిన సంఘటనే. అది సత్యం జీవితాంతం మరిచిపోలేడు.

ఆవాళ మధ్యాహ్నం చిట్టి ఒంటరిగా వున్నప్పుడు సత్యం సరదాకి అడిగాడు: "ఎంతమందిరంతేసి పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారు కాదు? నువ్వింత యిష్టపడుతున్నావని నాకు మొదట్లో తెలిసింది కాదు. పోనీ మళ్ళీ నన్ను చేసుకోనా?"

"అబ్బా పోదురూ బావగారూ!" అని మాత్రం అనగలిగింది అది. సత్యం దానివైపు చూశాడు. మబ్బుల్లో మెరుపుతీగలా మనోజ్ఞత, నవరవి కిరణాలు నదీతలంమీద చేసే నాట్యజ్వాలలోని విద్యుల్లత, సత్యం ఒక్కసారి దాని మొహంలో చూడగలిగేడు. ఆ చూపు అతని గుండెల్లో బాకులా గుచ్చుకుంది. అతని మనసంతా అవ్యక్త కరుణారసంతో నిండిపోయింది. అతను ఒక్కసారి పెళ్ళికూతుర్ని మనసులోకి తెచ్చుకున్నాడు. ఆమె మిలమిల మెరిసిపోయే అందాల రాణి. ఇదో? కరుణారసపవిత్ర ప్రేమ రాణి. ఏది హృదయానికి ఎక్కువ సమీపం? అతను ఓడిపోయాడు. మాతృ విహీనత నిరంతరం వెంట తిరిగే యీ నిర్భాగ్యమూర్తి అజ్ఞాతావలోకనమే అతన్ని గెల్చింది. ఆనాడు మొదలు సత్యం చిట్టిని మరి ఏడిపించలేదు. కన్నతల్లి లేని పన్నెండేళ్ళ పిల్లని ఏడిపించడంలో అతనిలో హాస్యరసమే ఓడిపోయి కరుణారసం మిగిలిపోయింది. చిట్టి ప్రవర్తన సత్యం జీవితంలో మెరుపులా మెరిసి మెరుగులు పెట్టింది.

---

ఒక చైనా టాక్సీడ్రైవరు ఒకే ముహూర్తంలో యిద్దరు స్త్రీలను పెళ్ళాడాడు. అయితే ఈ వివాహం ప్రేమకు సంబంధించింది కాదని స్పష్టంగా చెప్పేశాడు. వారిద్దరిలో ఒకరిని నెం 1, రెండవవారిని నెం. 2 గా చూపిస్తూ "నెం. 1 పిల్లను ఎందుకు పెళ్ళి చేసుకొన్నానంటే, నా తండ్రి తుదికోర్కెను తీర్చడానికి. నెం. 2 పిల్లను నా అన్న పెండ్లాడదామనుకున్నాడు- కాని ఆ సంబంధం చెడిపోయింది—ఆవిడకు తరుణోపాయం చూపడం నా విధి. అందుకని ఆమెను పెండ్లాడాను" అన్నాడు.